
తనకు అన్యాయం జరగడానికి కారకుడైన వ్యక్తినే అతను ఎందుకు ఆరాధించాడు?

# ఋణం




"రెండు మేష కంఠీరవంబులు... కంఠగ్రైవేయ ఘంటికాటంకారంబులును, విషయ విషాణ కోటి ఘటిత కపాలాయ సాశ్వత్థపల్లవ గుళుచ్ఛరింఛోళికా ఘణ ఘణాత్కారంబులు చెలంగ యుద్ధక్రీడాసన్నద్ధంబులై వచ్చుచున్నయవి"

"రెండు మేకపోతుల పోట్లాట ఘట్టాన్ని ఇలా రాస్తే ఎవడి కర్థమవుతుంది? మామూలుగా రాయక 'విషమాలూ', 'విషాణాలు' ఏమిటండీ—"

నా రచనలకు మొదటి విమర్శకురాలు మా ఆవిడే... భానుమతి.

"అందుకే — మీవి ఏవీ ప్రింటుకావు" అని విసురుగా వెళ్లిపోయింది.


"మేకపోతుల పోట్లాట దృశ్యాన్ని వ్రాయడంలోనీ ప్రేరణ నీదే. వంటింట్లోనుంచి దూకుడుగా వస్తూ వుంటే నాకు రెండు మేకపోతులే గుర్తుకొస్తాయి. ఇంగ్లీషులో చెప్పాలంటే నా 'ఇనిస్పిరేషన్' నువ్వే" అన్నాను — ఆవిడ వినపడనంత దూరం వెళ్లిన తర్వాత.

వెళ్లిన ఒక నిమిషంలో "కంఠగ్రైవేయ టంకారాలతో" భానుమతి అరిచింది.

"ఏమండోయ్! త్వరగా ఇలా రండి... తొందరగా కొంపలంటుకుంటున్నాయి"

ప్రతి విషయాన్ని అతిశయోక్తిగా మాట్లాడడం ఆవిడకలవాటే — అందుకే నాలుగైదుసార్లు అరిస్తే, "ఫూ" అని ఓ మూలుగు మూలిగి లేస్తాను.

నాకు తెలుసు... ఇంకా ఆగితే, కథలనీ, కథా రచయితలనీ, పత్రికలనీ, ఎడిటర్లను, ఒకే గాటలో కట్టేసి, వీళ్లంతా దేశానికి



ఉపయోగపడని పరాన్నభుక్కులుగా చిత్రీకరిస్తుంటుందికూడా.

ఈ చులకన భావం నాకు అలవాటైపోయింది.

ఓసారి, మా కిరాణా కొట్టు యజమాని, పాత బాకీలు కట్టలేదని దబాయిస్తుంటే, ఈవిడా పెద్ద గొంతుతో అరిచింది.

"ఎవరనుకుంటున్నావు? ఆయనో పెద్ద

రచయిత. అల్లాటప్పా మనిషనుకున్నావా?వ—''

దుకాణదారు ముఖంలో వెంటనే రంగులు మారాయి. ''వ్యాపారం'' నిండిన కళ్ళు, కరుణ వర్షించాయి. ఎవరైనా మనని తొక్కుతూ వెడితే ''కళ్లు కనబడ్డంలేదా'' అని కోప్పడతాం. ఆ మనిషి నిజంగా గుడ్డివాడని తెలిస్తే మన కోపం స్థానంలో సానుభూతి చోటుచేసుకుంటుంది. సరిగ్గా అలాంటి సానుభూతే కనిపించింది ఆ వ్యాపారిలో. నేనో రచయితనని తెలియగానే.

''అలాగా అమ్మా!'' అని నాకేసి ''ఈ ఏబ్రాసితో ఎలా కాపురం చేస్తున్నావు'' అన్నట్టు చూసి — ''మేష్టారూ! ఇకమీదట లెక్క అమ్మగారితో పంపండి'' — అన్నాడు. .. (పనికిరావా?)

దాంతో రచయితకు రావాల్సిన పూర్తిస్థాయి గౌరవం నాకు దక్కిపోయింది. ఎవరూ నన్ను పట్టించుకోరు. నేను దేన్నీ పట్టించుకోవడంలేదు.

''ఏమండీ — మిమ్మల్నే — ఎవరో మన స్థలంలో ఇల్లు కడుతున్నారు'' అని అరిచింది భానుమతి.

కొరడాతో కొట్టినట్టు ఉలిక్కిపడ్డాను.

అది వందగజాల చిన్న ప్లాటు... మా ఆఫీసులో రామచంద్రన్ నాయర్‌కీ, నాకు మధ్య వుంది. నాయర్ ఇంకా కట్టలేదు ఇల్లు.

గబగబా ఇంటిలోపలికి వెళ్లాను. ఎక్కువ దూరం లేదు. పది బై పది మూడు గదులు. ఆఖరి గది వంటిల్లు — దేముడి గది. స్టోర్ రూం వగైరా. దాని వెనకే వుంది ఖాళీ స్థలం.

ఎవరో ముగ్గులు వేస్తున్నారు — పునాదలు తీయడానికి. నాకు వళ్లు మండింది.

''ఎవరయ్యా అది? మా స్థలంలో తవ్వుతున్నారు?'' గట్టిగా అడిగాను.

గునపాలతో తవ్వుతున్న కూలీలు ఆగిపోయారు. ''హమ్మయ్య'' కొంత రెస్టు అన్న 'రిలీఫ్' కనబడింది.

కూలీలమీద అజమాయిషీ చేస్తున్న ఓ మనిషి నా దగ్గరగా వచ్చాడు.

''నీ స్థలమా! అది మాకు తెల్వది. బున్యాదిల్ తియ్యనీకి గుత్త తీస్కున్నా. షికాయత్ చెయ్యాలంటే మా మేస్త్రీతో చేస్కో... అని ఏం వకరాల్ జేస్తున్నార్? షురూ చేయ్రని. పన్ పన్ ఆప్తే నదాల్ తీస్తా...'' అని గదమాయించాడు కూలీలని.

నా పని అయిపోయింది. ఎవరైనా గట్టిగా అరిస్తే అంతే. ''మీ మేస్త్రీ ఎవరని'' అడగలేకపోయాను.

నా పక్కన చెవిలో సీసపు గుళ్లల్లా భానుమతి మాటలు.

''ఇల్లు చిన్నది. ప్రక్కన కాలు పెట్టడానికి లేదు. ఈ చిన్న స్థలంలో ఒక రూము వేసుకుందామనుకుంటే వీల్లేవరండీ''

ఆ స్థలంలో రూముతోపాటు, పూల మొక్కలు వేసుకుని, అక్కడ కుర్చీ వేసుకుని, అప్పుడప్పుడు పత్రికల్లో వచ్చే భావుకత నిండిన కథలూ, నవల్లూ చదువుకుందామన్న నా ఆశ నిరాశేనా? జీవితంలో నా ప్రథమ లక్ష్యం అదే. అదీ నెరవేరేటట్టు లేదు.

"బెల్లం కొట్టిన రాయిలా అలా నిలబడే వున్నారే. వెళ్లండి. ఆ నాయర్ని అడగండి" భానుమతి కంచు కంఠం ఖంగుమంది. "బెల్లం కొట్టకపోయినా రాయి రాయే" అనబోయి వూరుకున్నాను. లోపలికి వచ్చి చొక్కా వేసుకుని నాయర్ ఇంటికి బయలు దేరాను.

నాయర్ ఇంట్లోనే వున్నాడు. నన్ను చూసి నవ్వుతూ అన్నాడు. "సర్ప్రైసు. యూ హేవ్ ఆళిది వేకొం ఫ్రం కాళనీ?"

"నాయర్ — ఇంత అన్యాయం చేస్తావా ? నా స్థలంలో ఎవర్నో కట్టనిస్తావా?" అన్నాను నిష్ఠూరంగా.

"ఏం చెయ్యమంటావ్ — నా ఫ్రెండు — బాగా క్లోజ్ — మరీ కష్టాల్లో వున్నాడు — ఇవ్వక తప్పిందికాదు. నీకంటూ ఓ ఇల్లుంది —"

"మరి నీ స్థలం ఇవ్వవచ్చుగా — నాదే కావాల్సివచ్చిందా"

"నాది రెండు వందల గజాలే. మార్చిలో మొదలుపెడుతున్నాను"

"నా స్థలం ఇవ్వడానికి నువ్వెవరు?" కోపంగా అన్నాను.

నాయర్ నవ్వుతూ అన్నాడు.

"నీకెప్పుడు ఇచ్చాను"

తేలుకుట్టినట్టు జివ్వుమని ఓ విషయం గుర్తుకొచ్చింది.

నాయర్‌కి నేనేమీ డబ్బివ్వలేదు. ఆ స్థలం నా పేరుమీద రిజిస్ట్రేషన్ కాలేదు. "నీకు తప్ప ఎవ్వరికీ ఇవ్వను" అన్న మాట తప్ప ఆ స్థలం నాదని చెప్పే ఆధారాలేవీ లేవు. నాయర్ స్థలం. అతనిష్టం. గాలితీసిన బెలూనులా అయింది నా పరిస్థితి.

"నాయర్! ఆ స్థలంమీద ఎన్నో ఆశలు పెంచుకున్నా. ఇల్లు ఇరుగ్గా వుందని. కొన్ని మొక్కలు పెంచుకోవాలని... ఇప్పుడెవరికో ఇచ్చావ్! వాడెవరో తెలియదు. ఎలాంటివాళ్లో... వాడి కులం, గోత్రం, మతం,

## వంట!

"ఏవండోయ్ వంటయ్యిందా" అనడిగింది సుమిత్ర కిటికీలోనుండి పక్కింటి సుగుణకేసి చూస్తూ.

"అయిపోయింది, మరి మీది"

జిడ్డులా నిలబడిన బిచ్చగాడితో "విన్నావుగా వాళ్లింట్లో వంటయ్యిందట. అక్కడికి వెళ్లు" అంది సుమిత్ర.

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



వాడు గోల చేస్తుంటే, నా గ్రంథపఠనం దెబ్బతినదూ''

నా మనసులో ఓ వెయ్యిమాటలకు, ఓ మాటే బయటకు వస్తుంది. అదీ పూర్తిగా సైజు, రంగు, నెరపు మారిపోయి. అవి ఇలా బయటకు వచ్చాయి.

''ఎవరికి ఇచ్చావ్?''

''చెప్పానుగా — చిన్ననాటి స్నేహితులు — నాకు బాగా కావాల్సినవాళ్లు — పేరు గోపాల్'' నాయర్ అన్నాడు.

కొన్ని రుచులు, కొన్ని స్థలాలు, కొన్ని వాసనలు మనలో స్థిరంగా నిలబడిపోతాయి. అవే కొన్నేళ్ల తర్వాత అనుభవమైనా, వాటిలో సంధానం చెయ్యబడ్డ జ్ఞాపకాలు ఇబ్బడిగా బయటకు వస్తాయి.

అలాగే పేర్లుకూడా.

గోపాల్ అన్న పేరు నాజీవితంతో నా ఆరో ప్రాణంలా ముడిపడిపోయింది.

కొత్తపేటలో మా ఇంటి ప్రక్కే వుండేవాళ్లు గోపాలరావుగారు. మా తాటాకుల కొంప ప్రక్కన పెద్ద మండువా లోగిలి.

ఇరుగ్గా వుండే మా ఇంట్లోకంటే ఆ ఇంట్లోనే ఎక్కువసేపు వుండేవాళ్లం మేము. చిన్న వయసులో నేను అదీ మా ఇల్లే అనుకునేవాడిని. గోపాలరావు మామయ్యా అని, ఆయన భార్యని వజ్రమ్మత్తా అని పిలిచేవాళ్లం.

వయసు, జ్ఞానం పెరగడంతో మా కుటుంబపు హీనస్థితి తెలిసివచ్చేది. గోపాలరావుగారి విశాల హృదయంతో మమ్మల్ని ఆదుకోకపోయి వుంటే బతకడంకోసం యాచన చేయవలసిన స్థితి మాది. ఉద్యోగానికి పనికొచ్చే చదువుగాని, జీవనానికి పనికొచ్చే వృత్తిగాని లేవు మా నాన్నకు. ఎప్పుడూ 'డిప్రెషన్'లో వుండి పక్షవాత రోగిగా మారాడు.

మేము ఒక్కరేకాదు, ఆ ఫలవృక్షం ఫలాన్ని అందుకున్నది. ఆ అమృత మేఘం వర్షించింది మామీద మాత్రమేకాదు. ఎందరో ఇంకా.

నేను ఎస్.ఎస్.ఎల్.సీలో వుండగా పరీక్ష ఫీజు పదహారు రూపాయలు అడుగుదామని ఆ ఇంటికి వెళ్లాను.

ఎవరో పదిమంది వరకు వున్నారు. అందరి ముఖాలు జేవురించి వున్నాయి.

''మా డబ్బు పదిరోజుల్లో ఇవ్వాలి. లేకపోతే డిక్రీ అమలుచేస్తాం'' అంటున్నాడు వాళ్లలో ఒకడు. గోపాలరావు మ్లానవదనంతో వున్నారు. నేను వెళ్లిపోతుంటే పిలిచారు.

''ఏరా బాబూ ఇలా వచ్చావు?''

''పరీక్ష ఫీజు — మార్చి పెద్ద పరీక్షలకు'' అని నసిగాను.

ఆయన నన్ను అక్కడే వుండమని, కొంచెం సేపట్లో వచ్చారు. చేతినిండా బేడలు, అణాలు, కాణీలు — రెండు గుప్పెళ్లనిండా పోశారు.

''లెక్కపెట్టి కట్టేయి. ఇంకా చిల్లర మిగులుంటే 'పళ్లాలమ్మ' గుళ్లో వేసెయ్యి'' అన్నారు.

పది రోజుల తర్వాత కొద్దిపాటి సామాను తీసుకుని, వంటెద్దు బండిలో ఆయన వెళ్లిపోయారు. ఎక్కడికో తెలియదు.

చిన్న మొక్కకు గుక్కెడు నీళ్లే చాలు...

ప్రేమతో కూడిన ఆయన ఆ చిన్నదానం నేను ఈ రోజు కాలు నిలదొక్కుకునేలా చేసింది.

జనం నన్ను పిచ్చివాడినన్నా ఫర్వాలేదు. ఆయన మళ్లీ కనిపిస్తే రుణం తీర్చుకుంటాను — ఎలాగో అన్నదీ నాకు తెలియదు.

ఆయన, నాయర్‌కు తెలిసే అవకాశం లేదు. కేరళనుంచి వచ్చిన నాయర్‌కి, కోనసీమ కొత్తపేట గోపాలరావుగారు ఎలా తెలుస్తారు?

□ ■ □

ఇంటికొచ్చేసరికి భానుమతి దుమ్మెత్తిపోస్తోంది నాయర్‌ని.

"ఎంత మోసం — ఎంత మోసం — అసలీ కేరళ వాళ్లంతా ఇంతే" తిట్టవలసి వచ్చినప్పుడు, ఏదో తేడా వెతికి దాన్ని ఆధారంగా తీసుకుని తిట్టడం, మానవ బలహీనత. భానుమతి ఆ ఉచ్చులో పడిపోయింది. "నాయర్ అన్నయ్యగారూ! మీ రుణం వుంచుకోము" అంది — నాయర్ స్థలం మాకే ఇస్తానన్నప్పుడు — ఇప్పుడు?

భానుమతికి విషయం చెప్పాను. తిట్టే నోరు కట్టుబడింది.

"ఆ స్థలం మనదికాదు. తనకి బాగా కావాల్సినవాళ్లకి ఇచ్చాడు. తప్పేముంది. నేను అదే చేసేవాడిని" అన్నాను. రోజులు గడుస్తున్నకొద్దీ మా ప్రక్క స్థలంలో ఇల్లు రూపురేఖలు దిద్దుకుంటూ వుంది. నేను ఈ విషయాన్ని విధికి వదిలేశాను. అతి తేలికైన పలాయనమార్గం అదే. ఎందుకు మనస్తాపం?

"ఈ నాయర్ ఏ కేరళ వాళ్లని పెడ్తాడో — చేపల కంపు — కొబ్బరి నూనె తాలింపులు. భగవంతుడా... మనుషులెటువంటి వాళ్లో దెబ్బలాటకోరులా..."

భానుమతి నోరు లొడలొడా వాగుతూనే వుంది. ఇల్లు పూర్తయి మా పొరుగువాళ్లు ఇంట్లో దిగనే దిగారు.

## వండర్ ఫోలిక్ ఆమ్లం



'ఫోలిక్ ఆమ్లం' అనే విటమిన్ స్త్రీలకు ఎంతో మేలుచేస్తుంది. అందుకే ప్రస్తుతం అమెరికాలో స్త్రీలు దీనికోసం బాగా ఆకు కూరలు తింటున్నారు. రోజుకు కనీసం 400 మైక్రోగ్రాములు ఫోలిక్ ఆమ్లాన్ని తీసుకుంటే గర్భం ధరించిన స్త్రీలకు సుఖప్రసవం అవడమేకాక పిల్లలకు జన్మతః వచ్చే వ్యాధులుకూడా పోకవట! అలాగే గత రెండేళ్లుగా అమెరికాలో జరిగిన పరిశోధనలలో అతితక్కువగా ఈ విటమిన్ లోపించినా గర్భంలో వుండే పసికందుకు గుండెజబ్బు, క్యాన్సర్ వచ్చే అవకాశం వుందని తేలింది. మరి ఇకనుంచి మన దేశంలోకూడా స్త్రీలు ఫోలిక్ ఆమ్లంపట్ల కాస్త మోజు చూపించి తీరాలి!

— జూపిటర్

ఎవరో ఇద్దరు ముసలివాళ్లు. ఒక యువ దంపతులు. చిన్న ఇంట్లో చిన్న కుటుంబం.

ఆ రాత్రి నాకు నిద్ర రాలేదు. భానుమతి భయాలు నాకు పట్టుకున్నాయి.

తెల్లవారుజామునే దేవుడి పూజ మంత్రాలువినపడ్డాయి పక్కింట్లోనుంచి.

హమ్మయ్య ఫర్వాలేదు. దైవభక్తి ఉన్నవాళ్లే. దైవభక్తి వుంటే పాపం, కోపం వుండవని గ్యారంటీ లేదు. అయినా — వారం రోజుల తర్వాత భానుమతి సంబరంగా అరుచుకుంటూ వచ్చింది.

''వీళ్లది మీవూరేట...''

నాకూ ఉత్కంఠ బయలుదేరింది— మేము ఎవరో వీళ్లకి తెలుసా? తెలియడానికి మాదేం గొప్ప చరిత్రకాదు. గోపాలరావుగారు తెలుసా?

వెంటనే చెప్పులేసుకుని బయలుదేరాను పక్కింటికి.

ముసలాయనకు నమస్కారం చేసి లోపలికి వెళ్లాను. ఆయన కొడుకనుకుంటా కూర్చుని ఏవో వ్రాసుకుంటున్నాడు.

''రండి... రండి, నాపేరు భాస్కర్... మా అమ్మా నాన్న బయట వున్నారు?''

మాటల్లో తెలిసింది అతను బియ్యం వ్యాపారం చేస్తాడు. ''మేం కేరళనుంచి వచ్చాం'' అన్నాడు.

నేను నిరాశగా ఫీలయ్యాను. మరి భానుమతి కొత్తపేటని చెప్పిందే. అదే అడిగాను.

''మా నాన్నగారిది కొత్తపేట — నా చిన్నప్పుడే విడిచిపెట్టేశాం''

నేను ఆ వూరు వదిలి ముప్పై ఏళ్లవుతుంది. వీళ్లు ఎప్పుడుండేవారో అక్కడ. కాలం రూపంలో ఏవి మార్పులు తెచ్చిందో. ముందుగదిలో కూర్చున్న ముసలి దంపతుల దగ్గరకు వచ్చాడు. ఇదివరకు చూసిన గుర్తు లేదు. రాళ్లు పగలగొట్టేవాడు మామూలుగా అనాసక్తంగా రాయి పగలగొదుతుంటే కోహినూర్ వజ్రం దొరికినట్టయితేఎంత థ్రిల్ ఫీలవుతాడో అలాగే ఫీలయ్యాను. ఆ తర్వాత ఆయన చెప్పినది విన్న తర్వాత.

ఆ ముసలాయన గోపాలావుగారే. ఆవిడ మా 'వజ్రమ్మత్తే'. ఇద్దరికీ ఎనభై ఏళ్లు దాటి వుంటాయి. పోలికలలో చాలా మార్పు వచ్చింది.

కొత్తపేట వదిలి కేరళ వెళ్లిపోయి అక్కడ బియ్యం వ్యాపారం చేసారట. అక్కడే నాయర్ పరిచయమయ్యాడుట.

మళ్లీ పుట్టిన గడ్డమీద మమకారంతో తిరిగి వచ్చారుట.

నాకు చాలా సంతోషంగా వుంది. ''ఈయనకు సేవచేసుకుని రుణం తీర్చుకోవచ్చు'' అనుకున్నాను. స్థలం పోయినా మనసున్న మనిషి దక్కాడు.

భానుమతికి చెప్పాను — ''నా స్వంత అమ్మానాన్నల్లా చూసుకుంటాను''అంది.

మర్నాడే నాయర్ని కలిసి అన్నాను — ''నీ మేలు జన్మలో మరచిపోలేను — నా కన్నవార్ని నాతో కలిపినట్టుగా వుంది. వారి సేవ చేసుకునే భాగ్యం కల్పించావు'' అన్నాను.

నాయర్ ముఖం విషాదమయమైపోయింది.

''సారీ! బ్రదర్!'' అన్నాడు.

''ఏం జరిగింది'' అడిగాను.

''గోపాలరావుగారికి నీ సంగతి చెప్పాను. అదే నీ ప్లాటు సంగతి. అది నీకు వదిలేశారు. నిన్ననే ఆ స్థలం, ఇల్లూ నీ పేరుమీద ట్రాన్స్ఫర్ అయింది''

నా మెదడులా ఆటంబాంబుల్లా పేలాయి ఆ మాటలు.

''ఆయనకిది మామూలే కేరళలో సంపాదించిందంతా గురువాయురప్పన్ గుడికి ఇచ్చేసి కట్టుబట్టలతో వచ్చేశారు.''

నా చెవులు మొద్దుబారిపోయాయి.

ఆయన రుణం తీర్చుకునాలనుకున్నానా ?

లోకానికి జీవశక్తి ఇచ్చే సూర్యుడి రుణాన్ని, అమృతకిరణాల చంద్రుడి రుణాన్ని, ప్రాణశక్తినిచ్చే మేఘమాలికల రుణాన్ని తీర్చుకోగలమా!

